ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.50 (310.5510)	2,60,611	2,51,238
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.60 (3.84)	3,372	1,296
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.88 (41.05)	2,30,788	2,30,788

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.160 | స్కిన్‌లెస్ : రూ.190



రైతుకు భరోసా ఏదీ!

గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందా? లేదా అనే దిసందిగ్ధంలో పడింది. గుట్టలకు, చెట్లకు, పుట్టలకు, రోడ్ల కు, ఇటుక బట్టీల స్థలాలకు, వెంచర్లకు రైతుబంధు పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబ్బును వృథా చేసిందని గతంలో కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పించారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు రైతుబంధును పూర్తిస్థాయిలో అమలు చేసింది. రైతుబంధు లో మార్పులు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం యత్నించినా దీనిపై నేటికీ ఎలాంటి ప్రకటన లేదు. ఫలితంగా రైతుబంధు అములులో అనుమానాలు నెలకొన్నాయి.

- నల్లగొండ

- ఇంకా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- వానాకాలం సీజన్‌కు అందని పెట్టుబడి సాయం
- ఇప్పటికీ రూపొందని మార్గదర్శకాలు
- ఉమ్మడి జిల్లాలో 11లక్షల మందికి పైగా రైతుల ఎదురుచూపు

రైతుబంధును ప్రభుత్వం రైతుభరోసా పేరుతో ఉమ్మడి జిల్లాల స్థాయిలో రైతుల అభిప్రాయాలు తీసుకుంది. ప్రస్తుతం ఆ ఫైల్‌ను ప్రభుత్వం ఆటకెక్కించింది. అభిప్రాయాలను తీసుకున్న తరువాత అసెంబ్లీలో చర్చ పెట్టి అమలు చేస్తామని చెప్పినా, తీరా అసెంబ్లీలో చర్చను సైతం పక్కన పెట్టింది. ఇంతలో రుణమాఫీపై దృష్టిసారించి ప్రభుత్వం రైతుభరోసాను పట్టించుకోకపోవడంతో రైతులకు పెట్టుబడి సాయం అందకుండా పోయింది. రుణమాఫీ విషయంలో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండానే ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ నేపథ్యంలో రైతుభరోసా అమలు చేసే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుండగా, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం అధికారుల నుంచి నివేదికలు తీసుకొని రైతులకు భరోసా కల్పించకపోవడం ఎంత వరకు సమంజసమని పలు రైతు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 11లక్షల మంది రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 11లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5.50లక్షల మంది, సూర్యాపేట జిల్లాలో 3.50లక్షల మంది, యాదాద్రి జిల్లాలో 2.10లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. సాగు భూమి 21 లక్షల ఎకరాల వరకు ఉంది. ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడులకు రైతులకు భరోసా కల్పించకపోవడంతో వారు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వానకాలం సీజన్ ముగియవస్తున్నా, నేటికీ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించలేకపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఎంత భూమి ఉన్నా ఎకరానికి రూ.5వేల చొప్పున రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎకరానికి రూ.7500 చొప్పున ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావొస్తున్నా దీనిపై అతీగతి లేదు. రైతుభరోసా అమలుకు ముందుకు వెళ్లాలంటే ఎన్ని ఎకరాలు ఇవ్వాలనే దానిపై కటాఫ్ ప్రకటించాల్సి ఉంది. అప్పటి ప్రభుత్వం భూమి ఎంత ఉన్నా ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం ఎంత వరకు తగ్గించాలి? ఎన్ని ఎకరాలకు ఇవ్వాలనేది తేల్చలేని పరిస్థితుల్లో ప్రభుత్వం డైలమాలో ఉన్నట్లు సమాచారం.

యాసంగికైనా అందేనా?

వానాకాలం సీజన్ ముగుస్తున్నా రైతుభరోసాపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కనీసం వచ్చే యాసంగి నాటికైనా వానాకాలంతో పాటు యాసంగికి రెండు సీజన్లకు కలిపి పెట్టుబడి సాయం అందిస్తారా? లేదా అనే దానిపై తేల్చాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వ నిర్ణయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత వానాకాలంలో వర్షాలు ఆలస్యంగా కురవడం తో ఇప్పుడిప్పుడే మెట్టపంటల్లో ప్రధానమైన పత్తి చేలు జీవం పోసుకున్నాయి. ఈ నేపథ్యంలో పత్తి చేలతో పాటు వరి సాగు కు రైతులకు పెట్టుబడుల అవసరం పెరిగింది. చేతిలో డబ్బు లేక రైతులు అప్పులు చేస్తున్నారు. ఎకరానికి రైతులు రూ.25వేల చొప్పున పెట్టుబడులు పెట్టారు. ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అధిక వడ్డీకి డబ్బు తెచ్చిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా ఎకరాకు రూ.2,500 అంటే మొత్తం రూ.7,500 ఇస్తామని ప్రకటించడంతో ఎంతో ఆశపడిన రైతులు ప్రభుత్వ నిర్ణయం ప్రకటించకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. అసలు ఈ రెండు సీజన్లలో రైతుభరోసాపై నిర్ణయం జరుగుతుందా? లేక వాయిదా వేస్తారా? అనే అనుమానాలు రైతుల్లో ఉన్నాయి. వాస్తవానికి అయితే ఈ వానాకాలంలో జూన్ నెలాఖరులో రైతుభరోసా రావల్సి ఉంది. అయితే రెండు నెలలు పైగా గడిచినా నేటికీ నిర్ణయం తీసుకోలేదు.

మార్గదర్శకాలు వచ్చిన వెంటనే అమలు

రైతుభరోసాపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. విధివిధానాలు రూపొందించి విడుదల చేసిన అనంతరం రైతాంగానికి పెట్టుబడి సాయం అందుతుంది. రైతుభరోసాపై ప్రభుత్వం రైతుల నుంచి అభిప్రాయాలు కూడా సేకరించింది. వీటన్నంటిని పరిగణనలోకి తీసుకొని రైతుభరోసాను అమలు చేస్తుంది. ఎకరాకు రూ.7,500 ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా త్వరలో ఉత్తర్వులు రానున్నాయి.

- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ, జేడీఏ

అభిప్రాయాలు ఓ వైపు... నిధుల భారం మరో వైపు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి సేకరిస్తున్న అభిప్రాయాల్లో జిల్లాకు ఒకలా భిన్నంగా ఉన్నాయి. కొంతమంది 10ఎకరాల వరకు రైతుభరోసా కల్పించాలని, మరికొంత మంది 15ఎకరాల వరకు, ఇంకొందరు 5ఎకరాల వరకు ఇవ్వాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే భూమి ఎంత ఉన్నా గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఇవ్వాలనే డిమాండ్ కూడా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా కాకుండా తక్కువ భూమికి రైతుభరోసా ఇస్తే రైతుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రహించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 11 సార్లు రైతుబంధును అమలు చేసింది. అప్పట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు దాదాపు ప్రతీ సీజన్‌లో రూ.1,450కోట్లకు పైగా రైతుబంధు వచ్చేది. ప్రస్తుతం 11లక్షల మందికి పైగా రైతులకు గతంలో మాదిరిగా అమలు చేస్తే ఎకరాకు రూ.7500 చొప్పున ఏటా రెండు సీజన్లలో రూ.15వేలు చెల్లిస్తే ప్రభుత్వంపై మరింత భారం పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో తక్కువ భూమికే రైతుభరోసా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా? లేక 10ఎకరాలు ఉన్న రైతులకు కూడా రైతుభరోసా ఇస్తుందా? అనేది వేచిచూడాల్సిందే. కటాఫ్‌పై నిర్ణయం తీసుకోకపోవడం వల్ల ఏ జిల్లాకు ఎంత నిధులు సమకూర్చాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆర్థికశాఖ కూడా కసరత్తు చేయాలి. ఈ నేపథ్యంలో రైతుభరోసాపై ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేక నాన్చుడు ధోరణిని అవలంబిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సాగునీటి కాల్వల పునరుద్ధరణకోసం ప్రభుత్వం భూసేకరణకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాలోని బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ పనులు, భూసేకరణపై అంచనాలు రూపొందించేందుకు సన్నాహాలు చేస్తోంది. అయితే సాగునీటి ప్రాజెక్టులకోసం భూసేకరణ, భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించడం ప్రభుత్వానికి సవాల్‌గా పరిణమించింది. అయితే స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి భూసేకరణ చేసిన పక్షంలో.. ఎన్ని నిధులైనా ప్రభుత్వం ఇస్తుందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో జిల్లాలో పనులు చకచకా కొనసాగుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



భూసేకరణకు కసరత్తు

- బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరకు సన్నాహాలు
- భూసేకరణతోపాటు చేపట్టాల్సిన పనుల కోసం అంచనాలు
- కాల్వలు వెడల్పుతో మరో 36వేల ఎకరాలకు అదనంగా ఆయకట్టు

యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో చేపట్టిన పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణకు సాగునీటి శాఖ అధికారులు రూ.384.43 కోట్ల మేరకు అంచనాలు రూపొందించారు. అయితే జిల్లాలోని బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలను ప్రస్తుతం ఉన్న డిజైన్‌లో కాకుండా దూరదృష్టితో తిరిగి రీడిజైన్లు చేయాలని, లైనింగ్ స్ట్రక్చర్ చేస్తే అదనంగా ఆయకట్టు సాగులోకి వస్తుందని స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 30న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయిలో సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల పురోగతిపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మూసీ పరివాహక ప్రాంతాల్లోని ఎమ్మెల్యేలంతా కూడా కాల్వలు వెడల్పు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల విన్నపం మేరకు సరికొత్తగా.. ప్రస్తుతం ఉన్న డిజైన్ కాకుండా 15 అడుగుల వరకు పెంచేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తద్వారా జిల్లాలో మూడు కాల్వల కింద ప్రస్తుతం ఉన్న ఆయకట్టు కంటే 86వేల ఎకరాలు అదనంగా రానుందని ఎమ్మెల్యేలు కోరుతున్నారు. అయితే భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. రైతులతో స్థానిక ఎమ్మెల్యేలు చర్చించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బునాదిగాని కాల్వ పనులు చేపట్టేందుకు గతంలో దాదాపు 200 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టేందుకు అధికారులు సిద్ధం చేశారు. అయితే కాల్వలను వెడల్పు చేయాలని యోచిస్తున్న నేపథ్యంలో బునాదిగాని కాల్వకు దాదాపు 350 ఎకరాలకు పైగా ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలకు 250 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టే అవకాశం ఉంది. ఈ మేరకు సాగునీటి శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు భూసేకరణపై కసరత్తు ప్రారంభించారు. త్వరలోనే మూసీ పరివాహక ప్రాంతాల రైతులతో సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

20 ఏళ్లుగా నిరీక్షణ

వర్షాకాలంలో మూసీలోకి ప్రవహించే ఎగువ వరద నీటిని వినియోగించుకునేందుకు కాల్వల నిర్మాణానికి గత ప్రభుత్వాలు శ్రీకారంచుట్టాయి. బునాదిగాని, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వల పునరుద్ధరణ పనులు మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్న చందంగా ఉన్నాయి. ఈ పనులు నత్తనడకన సాగుతుండడంతో గత 20 ఏళ్లుగా సాగునీటికోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కాల్వల పునరుద్ధరణలో భాగంగా పనులు చేపట్టేందుకు ఇప్పటివరకు ముగ్గురు కాంట్రాక్టర్లు మారారు. మట్టి పనులే తప్ప, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సిమెంట్‌తో నిర్మించిన కల్వర్టులు నిర్మించలేదు. కాంట్రాక్టర్లు మట్టి పనులుచేసి చేతులు దులుపుకున్నారు. కల్వర్టులు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఆధునికీకరణ పనులతోపాటు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2017లో ధర్మారెడ్డి, బునాదిగానీ, పిలాయిపల్లి కాల్వల నిర్మాణంకోసం ప్రభుత్వం రూ.284.85కోట్లు మంజూరు చేసింది. అప్పటివరకు 20వేల ఎకరాల ఆయకట్టు నుంచి 60వేల వరకు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ నిధుల్లో ధర్మారెడ్డి కాలువకు రూ.65కోట్ల మేరకు కేటాయించింది. బునాదిగాని కాల్వకు రూ.100 కోట్లు, పిలాయిపల్లి కాల్వకు రూ.119.58 కోట్లు కేటాయించింది. భూసేకరణతోపాటు కాల్వల పునరుద్ధరణ, కల్వర్టుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. గత ఆరేళ్ల నామమాత్రంగా పనులు చేపడుతున్నారే తప్ప, పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కాల్వల పునరుద్ధరణ పూర్తయ్యేనా? అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాల్వలు పునరుద్ధరిస్తే 60వేల ఎకరాలకు సాగునీరు



పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వలను గతంలో రూపొందించిన అంచనాల ప్రకారం పునరుద్ధరించిన పక్షంలో యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లోని ఏడు మండలాల్లో 60వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. గత ప్రభుత్వాలు అంచనాల ప్రకారం 50 క్యూసెక్కుల నీరు రైతుల పొలాల్లోకి వెళ్లేది. అయితే 2016లో ప్రభుత్వం కాల్వల పునరుద్ధరణతో 200 క్యూసెక్కులు అందించాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించింది. ధర్మారెడ్డి కాల్వను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తే వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట, చిట్యాల, నకిరేకల్ మండలాల్లోని 49 చెరువులు కుంటలు నిండుతాయి. ఈ నీటితో మూడు మండలాల్లో 17,500 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఈ కాల్వ పొడవు మొత్తం 51 కిలోమీటర్లకు 102కల్వర్టులు నిర్మించాలి. పిలాయిపల్లి కాల్వ ద్వారా భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలాల్లో 18 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌తో 46 చెరువులు నిండనున్నాయి. ఈ కాల్వ ద్వారా 22,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. బునాదిగాని కాల్వ 98 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ కాల్వ పునరుద్ధరిస్తే ఏడు మండలాల్లోని 93 చెరువులు నిండనున్నాయి. మొత్తం 20 వేలకు పైగా ఎకరాల్లో సాగునీరు అందనుంది. అయితే ప్రభుత్వం కాల్వలను వెడల్పు చేయడంతో మరో 36వేల ఎకరాలు అదనంగా ఆయకట్టు సాగులోకి రానుంది.

బెల్ట్‌షాపుల మూసివేతపై తగ్గేదేలే



బెల్ట్‌షాపులు మూసివేస్తున్నట్లు ప్రకటించిన నిర్వాహకులను హైదరాబాద్‌లోని తన నివాసంలో సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- స్వచ్ఛందంగా మూసివేసిన నిర్వాహకులకు సన్మానం

మునుగోడు రూరల్, సెప్టెంబరు 10: మునుగోడు నియోజకవర్గంలో బెల్టుషాపుల మూసివేతపై తనపై వ్యతిరేకత వచ్చినా వెనక్కి తగ్గేది లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలం ఊకొండి గ్రామంలో 10కి పైగా బెల్టుషాపులు నిర్వహిస్తుండగా, ఎమ్మెల్యే పిలుపు మేరకు వాటిని స్వచ్ఛందంగా మూసివేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. మంగళవారం ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఇకపై బెల్టుషాపులు నిర్వహించబోమని తెలిపారు. దీంతో ఆయా నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించడానికి, సమాజ శ్రేయస్సు కోసం నియోజకవర్గంలో బెల్ట్‌షాపులు మూసివేయించాలని సంకల్పించామన్నారు. ఈ ప్రయత్నంలో తనపై వ్యతిరేకత వచ్చినా వెనక్కి తగ్గేది లేదన్నారు. ఇందుకోసం మహిళలు, పురుషులతో కమిటీలు వేశామని, ప్రస్తుతం ఇది ఫలితం ఇస్తోందన్నారు. కమిటీల ద్వారా గ్రామాల అభివృద్ధి చేపడతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి బెల్టుషాపుల మూసివేతకు గ్రామాల్లో పెద్ద ఉద్యమాన్ని చేపట్టామని, నిర్వాహకులు సైతం స్వచ్ఛందంగా మూసివేసి ఆరోగ్య సమాజ నిర్మాణానికి నడుం బిగించడంపై వారిని అభినందించారు. కార్యక్రమంలో బెల్ట్‌షాపు మూసివేసిన నిర్వాహకులు శంకరయ్య, బోయినపల్లి వెంకన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

త్రిపురారం సెప్టెంబరు 10: మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మంగళవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్ ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాల, అనుముల మండలంలోని కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, చల్మారెడ్డిగూడెంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, స్టోర్‌రూంను, తరగతుల వారీగా విద్యార్థుల హాజరును పరిశీలించారు. కస్తూర్బా పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హాలియా మండలంలో తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల, ఎస్‌వో విజయలక్ష్మి, దాస వెంకన్న, ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 10: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి వైద్యులు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆలగడప పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేసి రోగులతో మాట్లాడి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని జ్వరాలు డెంగీ కావని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో గీతావాణి, సీహెచ్‌వో మోతిలాల్, హెచ్‌ఈవో ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు నేడు డిప్యూటీ సీఎం

- రెండో యూనిట్ విద్యుదుత్పత్తికి ట్రయల్ రన్
- అధికారులతో సమీక్ష నిర్వహించనున్న భట్టి, మంత్రులు



వీర్లపాలెం గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ ప్లాంట్

దామరచర్ల, సెప్టెంబరు 10: మండల పరిధిలోని వీర్లపాలెం గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం సందర్శించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.40నిమిషాలకు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చేరుకుంటారు. నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు యూనిట్లలో నాలుగు తుది దశకు చేరుకున్నాయి. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-2 పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే యూనిట్ లైటప్(బాయిలర్‌లో లీకేజీలు ఉన్నాయా లేవా అనేది లైట్ల వెలుగులో పరిశీలించటం) వద్ద నిర్వహించారు. నేడు రెండో యూనిట్‌ను జనరేటర్‌కు అనుసంధానం చేసి విద్యుదుత్పత్తికి చేపట్టిన ట్రయల్ రన్‌ను మంత్రులు ప్రారంభించనున్నారు. పరిశ్రమను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డిప్యూటీ సీఎం, మంత్రులు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి



14వ మైలు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్

సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

హాలియా, సెప్టెంబరు 10: అలీనగర్ (14వ మైలు) సమీపంలో సాగర్ ఎడమ కాల్వ బ్రిడ్జి వద్ద వినాయక నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. హాలియా మునిసిపాలిటీ పరిధిలోని 14వ మైలురాయి వద్ద నిర్వహించే గణేష్ నిమజ్జన ప్రదేశాన్ని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిమజ్జనానికి అసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, బ్యారీకేడ్లు, క్రేన్లు, లైటింగ్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. పిచ్చి మొక్కలను తొలగించి నేలను చదును చేయాలని సూచించారు. పారిశుధ్యంతోపాటు తాగునీరు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట అదనపు ఎస్పీ రాములునాయక్, తహసీల్దార్ జయశ్రీ, మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, చైర్‌పర్సన్ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, పలు శాఖల అధికారులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మిర్యాలగూడ టౌన్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. పట్టణంలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు సేవించడం దుష్పరిణామాలకు దారి తీస్తుందని, వీటిని విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. డీఎస్పీ రాజశేఖరరాజు మాట్లాడుతూ, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌పై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికత సొంతం చేసుకుంటున్న యువ ఇంజనీర్లు సామాజిక మాధ్యమాలపై పట్టు సాధించాలని, సాధారణ, సైబర్ నేరాలపై అవగహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మహిమూద్‌అలీ, డైరెక్టర్ షెహ్లాబతూల్, సీఏలు కరుణాకర్, నాగరాజు, వాణి, తబిత, పూజ, భారతి, సుబ్బారాయుడు, మహేష్, కన్నా, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 10: సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్యలు పిలుపునిచ్చారు. మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోందని విమర్శించారు. నాటి సాయుధ పోరాటమంతా వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, దున్నేవాడికి భూమి కావాలనే డిమాండ్‌తో సాగిందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. వ్యవసాయ పెట్టుబడుల సాయం కోసం ప్రభుత్వం వెంటనే రైతుభరోసా నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండ శ్రీశైలం, సయ్యద్ హాశం, సిహెచ్.లక్ష్మీనారాయణ, ఎండీ.సలీమ్, పి.నర్సిరెడ్డి, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, నలుపరాజు సైదులు, మన్నెం భిక్షం, కోట్ల అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 10 : యాదగిరిగుట్ట క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనృసింహ స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత అంజనేయస్వామికి పంచామృతాభిషేకం జరిపి పుష్పాలతో అలంకరించారు. సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణు పుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ ప్రత్యేకపూజలు చేపట్టారు. కొండపైన శివాలయంలో నిత్యపూజలు, నిత్యరుద్రహవనం కొనసాగాయి. వివిధవిభాగాల ద్వారా రూ.9,99,013 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులకు ప్రసాదాలు అందజేస్తున్న ఈవో

యాదగిరీశుడిని దర్శించుకున్న ఫైనాన్స్ కమిషన్ సభ్యులు

లక్ష్మీనరసింహస్వామిని 16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు అజయ్ నారాయణ ఝూ, డాక్టర్ సౌమకాంతి ఘోష్‌తో పాటు కమిషన్ సభ్యులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈవో భాస్కర్‌రావు ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆర్వీ కర్ణన్, కలెక్టర్ హనుమంతు కే జెండగే ఉన్నారు.

భ్రూణ హత్యకు పాల్పడితే జైలుకే

మోత్కూరు, సెప్టెంబరు 10: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, భ్రూణహత్యకు పాల్పడితే మొదటిసారి మూడేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా, రెండోసారి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా ఉంటుందని ఆడపిల్లల రక్షణ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుమన్‌కళ్యాణ్ హెచ్చరించారు. భ్రూణ హత్యలకు సహకరించిన వారికీ శిక్షలు తప్పవన్నారు. ఆడపిల్లల రక్షణ చట్టంపై ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులోని వైజే ఫంక్షన్ హాల్లో మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాలల్లో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో ఆయనతో పాటు డెమో ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ ఆసుపత్రుల వైద్యులు హేమంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, సీడీపీవో జ్యోత్స్న, సుశృత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు చెన్న కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి కందికట్ల లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యుడు కోక బిక్షం, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు ఎడ్ల యాదగిరి, అధ్యక్షుడు గనగాని నర్సింహ, రఘువర్ధన్, పురుగుల రమేష్, ధనుంజయ్య, పరశురాములు వెంకన్న, సోమలింగాచారి, శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.

యాదాద్రి మెడికల్ కళాశాలకు గ్రీన్‌సిగ్నల్

- ఈ విద్యా సంవత్సరం నుంచి 50 సీట్లతో ప్రారంభానికి హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 10: ఎట్టకేలకు యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో కొన్ని నెలలుగా ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. భువనగిరిలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుకు ఎన్‌ఎంసీ ఇచ్చిన లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్‌వోపీ) మేరకు వైద్య కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబసంక్షేమ శాఖ(హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ) మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి 50 సీట్లతో కళాశాల ప్రారంభం కానున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పట్టణ శివారు పగిడిపల్లిలోని పాతకలెక్టరేట్ భవనంలో వైద్యకళాశాల, హాస్టల్ ఏర్పాటు కానుండగా భువనగిరిలోని ప్రస్తుత జిల్లా కేంద్ర ఆసుపత్రి ఇక నుంచి వైద్య కళాశాల బోధనాసుపత్రిగా కొనసాగుతుంది. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాల, బోధనాసుపత్రి ప్యాట్రన్ మేరకు బదిలీలు, నూతన నియామకాల ద్వారా అన్ని స్థాయిల్లో మెజార్టీ పోస్టులను భర్తీ చేయగా మిగిలిన పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నారు. ప్రతీ విద్యా సంవత్సరం వైద్య సీట్లు పెరుగనున్నాయి. భువనగిరిలో వైద్య కళాశాల ఏర్పాటుతో జిల్లా విద్యార్థులకు ఎంబీబీఎస్ చదివేందుకు అవకాశాలు మెరుగయ్యాయి. అలాగే బోధనాసుపత్రితో వైద్యసేవలు పెరిగి రోగులకు ఉచిత నాణ్యమైన చికిత్సలు, రోగ నిర్ధారణ పరీక్షలు, మందుల పరంగా ఉపశమనం లభించనుంది. ఎన్‌ఎంసీ ఇచ్చిన ఎల్‌వోపీ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అండర్ టేకింగ్ ఇచ్చిన అనంతరం ప్రక్రియ పూర్తయి వైద్యకళాశాల ప్రారంభం కానుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు ఈ పాటికే అధికారులు పూర్తి చేసినట్లు సమాచారం.



భువనగిరిలో ఏర్పాటుచేయనున్న ప్రభుత్వ వైద్యకళాశాల, భోదనాసుపత్రిగా మారనున్న జిల్లా కేంద్ర ఆసుపత్రి

ఊరించిన ఎన్‌ఎంసీ అనుమతులు

వైద్యకళాశాల ఏర్పాటులో ఎన్‌ఎంసీ అనుమతులు ముఖ్యమైనవి వైద్య కళాశాల, బోధనాసుపత్రిలో ఉన్న వసతులు, ఔట్ పేషంట్, ఇన్ పేషంట్ విభాగాలు, ప్రొఫెసర్స్, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్స్, రెసిడెంట్ డాక్టర్స్, నర్సింగ్ తదితర పోస్టుల భర్తీ తదితర అంశాలపై సమగ్ర పరిశీలన జరిపాకే ఎన్‌ఎంసీ అనుమతులు ఇస్తుంది. ఈ మేరకు భువనగిరిలో ప్రతిపాదించిన వైద్యకళాశాల కోసం జూన్ 23నుంచి ఎన్‌ఎంసీ బృందాలు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో పలు దఫాలుగా పరిశీలన జరిపారు. అదే సమయంలో కళాశాల ఏర్పాటుకు అనుమతులు సాధించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పాటు కొన్నేళ్ల పాటు రాష్ట్ర వైద్య, విద్య శాఖ డైరెక్టర్‌గా వ్యవహరించిన డాక్టర్ రమేష్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపల్‌గా, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన డాక్టర్ రాజారావును జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. వారి అనుభవాల మేరకు ఎన్‌ఎంసీ బృందాలకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందివ్వడం, లోపాలను సవరించడం, కలెక్టర్ హనుమంతు కే జెండగే పాలనాపరమైన సహకారం అందించారు. అదేవిధంగా ఇటీవలి వరకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం డీసీహెచ్‌ఎస్‌గా కొనసాగుతున్న డాక్టర్ చిన్నానాయక్ సకాలంలో అవసరమైన సమాచారాన్ని అందించారు. వీరికి తోడుగా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది కృషి ఫలితంగా వైద్య కళాశాల ఏర్పాటుపై జిల్లా ప్రజల కల నెరవేరుతున్నదని పలువురు అంటున్నారు. వైద్య కళాశాల ఏర్పాటుకు ఎన్‌ఎంసీ ఎల్‌వోపీ ఇవ్వడం, హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ ఉత్తర్వులు జారీ చేయడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మలిసంధ్యలో అరుణవర్ణం



వర్షాలతో కొద్దిరోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సూర్యుడి దర్శనమే కరువు కాగా మంగళవారం భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. సూర్యాస్తమయ సమయంలో ఆకాశం ఎర్రని రంగును పులుముకుని అరుణవర్ణంలో ప్రకాశవంతంగా కనిపించింది. వర్ణకాంతులు, ప్రకృతి అందాలు అందరినీ ఆకట్టుకున్నాయి.
- మునుగోడు

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 10: గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయరహదారిపై కిష్టాపురం గ్రామంవద్ద సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, రూరల్ ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పల్లా సైదమ్మ(55) గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో పాల్గొని రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. ఇదే సమయంలో గుర్తుతెలియని వాహనం సైదమ్మను ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించి స్థానికులు 108వాహనంలో చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందిందని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సైదమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఆమె కుమారుడు విజయ్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో యువకుడు..


నరేష్(ఫైల్ ఫొటో)

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 10 : గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చిన్నతుమ్మలగూడెంలో మంగళవారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తుల ద్వారా తెలిసిన వివరాలిలా ఉన్నాయి. చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన కమ్మాలపల్లి లింగయ్య, సత్తమ్మ దంపతుల చిన్న కుమారుడు నరేష్(30) పీజీ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లో ఉంటూ గ్రూప్-2 ఉద్యోగానికి సిద్ధమవుతున్నాడు. కాగా మంగళవారం ఉదయం గదిలో ఉండగా ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పాడు. దీంతో అతడిని వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేస్తుండగానే చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లిదండ్రులు గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ కుమారుడిని చదివిస్తూ ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలనుకున్నారు. కానీ కుమారుడు గుండెపోటుకు గురై చనిపోవడంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధదంపతులకు గాయాలు

చిట్యాల, సెప్టెంబరు 10 : నల్లగొండ జిల్లా చిట్యాలలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన వృద్ధదంపతులు దాసరి పార్వతమ్మ, దాసరి నర్సింహులు మంగళవారం చిట్యాలకు వచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది, ఈ సంఘటనలో గాయపడిన దంపతులను చికిత్సనిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

పాఠశాలలో కట్ల పాము


పాఠశాలలో గ్రామస్తులు చంపిన పాము

నూతన్‌కల్, సెప్టెంబరు 10 : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం బక్కహేమ్లతండా లోని పాఠశాలలో మంగళవారం కట్ల పాము కనిపించింది. రోజు వారి మాదిరిగానే విద్యార్థులు పాఠశాలకు వచ్చారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తీయడానికి డబ్బాను తెరవగా అందులో కట్ల పాము కనిపించింది. అప్రమత్తమైన ఉపాధ్యాయులు గ్రామస్తులకు సమాచారం అందించారు. వెంటనే పాఠశాలకు చేరుకున్న స్థానికులు పామును చంపారు. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాలలో స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాలలో ఎప్పుడు ఏంచేరుతున్నాయో తెలియని పరిస్థితి ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్యానికి భార్య డబ్బులివ్వలేదని ఆత్మహత్య


వెంకటయ్య(ఫైల్)

చిట్యాల రూరల్, సెప్టెంబరు 10 : మద్యం తాగేందుకు భార్య డబ్బులివ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తిలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ ధర్మ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నకాపర్తికి చెందిన తిర్మలదాసు వెంకటయ్య(50) కుల వృత్తి మంగలి పనిని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా వెంకటయ్య మద్యానికి బానిసయ్యాడు. తాగేందుకు భార్య అండాలు డబ్బులు అడగ్గా, ఆమె ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురైన వెంకటయ్య సొంత పొలం వద్దకు వెళ్లి క్రిమిసంహారక మందును తాగి వాంతులు చేసుకున్నాడు. సమీపంలో పనిచేసుకుంటున్న పాకాల అంజయ్య గమనించి వెంకటయ్య పెద్దకుమారుడికి సమాచారమిచ్చాడు. పొలం వద్దకు వెళ్లిన పెద్దకుమారుడు మత్స్యగిరి తండ్రిని అంబులెన్స్‌లో నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నకుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

హాలియాలో పట్టపగలు చోరీ


వేలిముద్రలను పరిశీలిస్తున్న క్లూస్ టీం

హాలియా, సెప్టెంబర్ 10 : నల్లగొండ జిల్లా హాలియా మునిసిపాలిటీ పరిధిలో మంగళవారం పట్టపగలు నగదు చోరీ అయ్యింది. ఈ సంఘటన మాజీ ఎంపీటీసీ చెరుపల్లి ముత్యాలు ఇంట్లో జరిగింది. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సాయిప్రతాప్‌నగర్‌లో నివాసముంటున్న చెరుపల్లి ముత్యాలు మధ్యాహ్నం ఇంటికి తాళం వేసుకొని బయటకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి రూ.1,70,000 నగదును చోరీ చేసినట్లు తెలిపారు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన ముత్యాలు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీంని రప్పించి వేలిముద్రలను పరిశీలించారు. బాధితుడు ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒక్కరోజుల్లో నిందితురాలి అరెస్ట్

రూ.6లక్షల విలువైన 9.4తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

నల్లగొండ, సెప్టెంబరు 10 : నల్లగొండ జిల్లా కేంద్రంలో చోరీ కేసులో నిందితుడిని పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేశాడు. అతడి నుంచి రూ.6 లక్షల విలువైన 9.4 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 8వ తేదీన నల్లగొండ పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని బాలాజీ ఫంక్షన్‌హాల్ వద్ద నివాసముంటున్న మలాన్ అనే మహిళ ఉదయం 11 గంటల సమయంలో కుటుంబ సమేతంగా ఆమె చెల్లెలు శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి అదేరోజు రాత్రి 8 గంటలకు వచ్చింది. ఆ సమయంలో ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించింది. బీరువాలో పెట్టిన రూ.6లక్షలు విలువైన 9.4తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన ఎస్‌ఐలు సందీప్‌రెడ్డి, శంకర్ లు రెండు బృందాలుగా క్రైం పార్టీ సిబ్బందితో పాటు కలిసి సమీప సీసీ టీవీ కెమెరాలను పరిశీలించారు. ప్రియదర్శినికాలనీలో ఉంటున్న నిందితులైన కొత్తపల్లి ధనలక్ష్మిని ఆమె అద్దెకుంటున్న ఇంటి వద్ద మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకోవడమే కాకుండా ఆమె వద్ద నుంచి దొంగతనం చేసిన సొత్తును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా 24 గంటల్లోనే కేసును ఛేదించడంతో పాటు సొత్తును రికవరీ చేసిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ సందీప్‌రెడ్డి, శంకర్‌ను, క్రైం సిబ్బంది షకిల్, శ్రీకాంత్‌లను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి, సెప్టెంబరు 10 : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. రావులపెంట మూసీ వాగు నుంచి అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన ఇంద్రపల్లి సుదర్శన్, పిట్టల ప్రవీణ్ తమ ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానులు సుదర్శన్, ప్రవీణ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

జూదరుల అరెస్టు

చౌటుప్పల్ రూరల్ సెప్టెంబరు 10: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులో జూదరులను అరెస్టు చేసినట్లు సీఐ మన్మథరావు తెలిపారు. ఆందోల్‌మైసమ్మ దేవాలయం సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రాత్రి పేకాటాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.26,410 నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక


నల్లగొండ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

నకిరేకల్, సెప్టెంబరు 10: నల్లగొండ ఉమ్మడి జిల్లా నుంచి హ్యాండ్ బాల్ జట్టును ఎంపిక చేసినట్లు నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. నకిరేకల్ మండలం మంగళపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వరంగల్ జిల్లా కేంద్రంలో జేఎన్‌ఎస్ స్టేడియంలో జరిగే 38వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. మంగళపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కర్రా వీరారెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, ఉపాధ్యాయులు లమిశెట్టి సత్యనారాయణ, రాజేందర్, చైతన్యకుమార్, కవిత, అంజి, ముత్తు, రాజ్యలక్ష్మి ఎంపికైన జిల్లా జట్టు క్రీడాకారులను ఘనంగా అభినందించారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 10 : బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల నల్లగొండ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి బయ్యన్న తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మైదానంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు హాజరై తమప్రతిభను ప్రదర్శించారు. పోటీలో అత్యంత ప్రతిభకనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈ నెల 14వ తేదీ నుంచి 15వ తేదీ వరకు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి మైదానంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల పోటీలో పాల్గొననున్నట్లు బయ్యన్న వెల్లడించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలుర జట్టులో గౌతమ్, సుశాంత్, వరుణ్, అజయ్, జశ్వంత్, చిన్ని, మనోజ్, అంజి, రామ్‌చరణ్, హనుమా, బాలికల విభాగంలో ఏకాంబరేశ్వరీ, భవ్యశ్రీ, కె.అలీనా, శృతి, జ్యోత్స్న, ఊహిత, కావేరి, శ్రీలత, అక్షిత, హారికలు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సత్తయ్య, జిల్లా క్రీడల నిర్వహణ కార్యదర్శి బాలునాయక్ పాల్గొన్నారు.

విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ విషాదం

- రక్తపు వాంతులతో ఆర్టీసీ కండక్టర్ మృతి


ప్రకాష్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న డీఎం సురేందర్, సీఐ సైదులు

శాలిగౌరారం, సెప్టెంబరు 10: విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న ఆర్టీసీ కండక్టర్ అకస్మాత్తుగా రక్తపు వాంతులు చేసుకుని మృతి చెందారు. మంగళవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామశివారులో ఈ సంఘటన జరిగింది.ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన వైద్యుల ప్రకాష్(50) సూర్యాపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. వల్లాల గ్రామంలోనే ఉంటూ సూర్యాపేటకు వెళ్తూ ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. కడపర్తి-వల్లాల గ్రామాల మధ్యకు రాగానే ద్విచక్ర వాహనం నిలిపి అతడి పెద్ద కుమారుడు మహంత్‌కు ఫోన్ చేసి తనకు బాగా కడుపు నొప్పి వస్తోందని, తొందరగా రమ్మని చెప్పి అక్కడే ఉన్నాడు. కుమారుడు అక్కడికి చేరుకున్న కొద్దిక్షణాలకే రక్తపు వాంతులు చేసుకుని అపస్మారకస్థితిలో పడిపోయాడు. వెంటనే 108 వాహనంలో నకిరేకల్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రకాష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే ఉండే ప్రకాష్ ఆకస్మిక మృతితో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సూర్యాపేట ఆర్టీసీ డీఎం ధర్మపురి సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ బీ.సైదులు, ఏడీసీలు బొజ్జ సైదులు, మాచర్ల భాస్కర్ తదితరులు వల్లాల గ్రామంలోని ప్రకాష్ ఇంటికి చేరుకొని భౌతికకాయంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి తమ సంతాపం, సానుభూతిని వెలిబుచ్చారు. కండక్టర్ ప్రకాష్ అకాల మరణం తీరనిలోటని డీఎం సురేందర్ అన్నారు.

పలుకరింపునకు వస్తే.. దొంగలుగా భావించి చితకబాదారు


దోతిగూడెం యువకుల దాడిలో గాయపడ్డ యువకులు

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 10: తెలిసిన వ్యక్తిని పలకరిద్దామని గ్రామానికి వస్తే, దొంగలు అనుకొని గ్రామస్తులు యువకులను చితకబాదారు. ఈ సంఘటన యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, గ్రామస్తుల కథనం ప్రకారం చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామానికి చెందిన గరిక లింగస్వామి, పగడాల ప్రకాష్, పాపగళ్ల లక్ష్మీనారాయణ అనే యువకులు తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో బీబీనగర్‌లో పనినిమిత్తం వెళ్తూ మార్గమధ్యలోని దోతిగూడెం గ్రామంలో కొలుపు చెప్పే యాట లింగస్వామి వ్యక్తిని పలకరించి వెళ్దామనుకున్నారు. వారు తమ కారు దిగి ఇంటి గల్లీలోకి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన యాట నరేష్ చూసి ఎవరో ఎవరో వ్యక్తులు వచ్చారని, దొంగలుగా భావించి వారిని పట్టుకుని బిగ్గరగా కేకలు వేశాడు. చుట్టుపక్కల గణేష్ మండపాల వద్ద ఉన్న యువకులు హుటాహుటిన వచ్చి ముగ్గురు యువకులను పట్టుకొని చితకబాదారు. కాగా, యువకులు తాము దొంగలం కాదని, లింగస్వామి ఇంటికి వచ్చామని చెప్పినా వారు వినిపించుకోలేదు. వెంటనే డయల్-100కు ఫోన్ చేయడంతో సంఘటనా స్థలానికి పోలీస్ పెట్రోలింగ్ వాహనం వెంటనే చేరుకుంది. గ్రామస్తుల చెర నుంచి ఆ యువకులను విడిపించి విచారించారు. గతంలో యాట లింగస్వామి దగ్గరికి కొలుపు చెప్పించుకున్నామని, మరోసారి అతడిని పలకరిద్దామని వచ్చామని చెప్పారు. గాయాలు తగిలిన యువకులను పోలీసులు చికిత్స నిమిత్తం బీబీనగర్ వెళ్తున్నామన్నారు. గాయాలు తగిలిన వ్యక్తులను చికిత్స నిమిత్తం పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందకపోవడంతో కేసు నమేదు కాలేదని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటు బాధితుడిని బతికించిన సీపీఆర్


భాగ్యరాజుకు సీపీఆర్ చేస్తున్న గోవిందరెడ్డి

మేళ్లచెర్వు, సెప్టెంబరు 10 : గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేసి బతికించారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడులో మంగళవారం జరిగింది. మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన రైతు దేరంగుల భాగ్యరాజు గ్రామంలోని తమ పిల్లలకు మధ్యాహ్నం భోజనం బాక్సులు ఇచ్చేందుకు పాఠశాలకు వెళ్లి వస్తున్నాడు. మార్గమధ్యలో గుండెపోటు వచ్చి కిందపడ్డాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన అన్నపురెడ్డి గోవిందరెడ్డి భాగ్యరాజుకు సీపీఆర్ చేసి స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమ ఆసుపత్రికి తరలించారు. దీంతో భాగ్యరాజు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. భాగ్యరాజుకు గుండెపోటు వచ్చిందని వైద్యులు నిర్ధారించారు. గోవిందరెడ్డి సమయస్ఫూర్తిని స్థానికులు అభినందించారు.

పెట్రోల్‌కు బదులు నీళ్లు


పెట్రోల్‌తో పాటు వచ్చిన నీరు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 10 : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలోని హెచ్‌పీ బంక్‌లో పెట్రోల్‌తో పాటు నీరు వచ్చింది. మంగళవారం పెట్రోల్ కొట్టించిన వినియోగదారులకు పెట్రోల్‌తో పాటు నీరు కూడా వస్తున్నట్లు అనుమానంతో బాటిల్‌లో పెట్రోల్ కొట్టించారు. బాటిల్‌లో పెట్రోల్‌తో కలిసి నీరు రావటంతో వినియోగదారులు బంకు ఎదుట నిరసన తెలిపారు. బంక్ సిబ్బంది వినియోగదారుల నిరసన మధ్యలో బంకుకు తాళాలు వేసి సిబ్బంది అక్కడి నుంచి జారుకున్నారు. ఇప్పటికైనా అధికారులు బంక్‌ను తనిఖీ చేసి సీజ్ చేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

పులిచింతల పరిసరాల్లో మొసలి కలకలం


వాగులో ప్రత్యక్షమైన మొసలి

మేళ్లచెర్వు, సెప్టెంబరు 10 : తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని పులిచింతల ప్రాజెక్టు పరిసరాల్లో మొసళ్లు కలకలం సృష్టిస్తున్నాయి. గత కొద్దిరోజుల కిందట చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం వాగులో మొసలి పిల్లలు కనిపించిన ప్రదేశానికి సమీపంలో మంగళవారం మరో మొసలి స్థానికులకు కనిపించింది. దీంతో స్థానికులు ఫొటోలు తీసి స్థానిక వాట్సాప్‌లో గ్రూపులో పోస్టు చేశారు. ఈ ప్రాంతంలో రెండు పెద్దమొసళ్లు తిరుగుతున్నాయని, మొసలి పిల్లలు సంచరిస్తున్నాయని, భారీ వర్షాలకు, వరదలకు ఈ ప్రాంతానికి కొట్టుకు వచ్చి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

హరితహారం చెట్లు నరికివేత



చింతపల్లి, సెప్టెంబర్ 10 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను ఇష్టానుసారంగా నరికివేశారు. వేంకటేశ్వరనగర్‌లోని హైవే సమీపంలో రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. ఆ మొక్కలను అనుమతుల్లేకుండా నరికివేశారు. ఈ విషయమై గొడుకొండ్ల గ్రామ కార్యదర్శి పద్మను వివరణ కోరగా రహదారికి ఇబ్బంది కలగకుండా నరికివేసినట్లు ఆమె తెలిపారు.

ఆదిపరాశక్తిగా దర్వేశీపురం ఎల్లమ్మ



కనగల్, సెప్టెంబరు 10 : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశీపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం ఆదిపరాశక్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమఅభిషేక పూజలు జరిపించి చీరసారెలను, బోననైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

బీసీలకు న్యాయం జరిగేలా కృషిచేయాలి


జయప్రకాశ్‌ను సన్మానిస్తున్న కృష్ణగౌడ్

నల్లగొండ, సెప్టెంబరు 10: బీసీలకు న్యాయం జరిగే విధంగా కృషిచేయాలని గౌడ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మాదగోని కృష్ణగౌడ్ అన్నారు. బీసీ కమిషన్ సభ్యుడు జయప్రకాశ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. బీసీ అనేక సమస్యలు ఎదురుకుంటున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీసీలకు అందేవిధంగా చూడాలన్నారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ హక్కుల పోరాట సమితి నాయకులు ఏంఎస్ రాజు, సురేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలన గాలికి వదిలేసిన ప్రభుత్వం : సీపీఎం

మాడ్గులపల్లి, సెప్టెంబరు 10: ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజాపాలనను గాలికి వదిలేసిందని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని ఇసుకబావిగూడెంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన అమలు చేయకపోవడం దారుణమన్నారు. అర్హులైన రైతులకు రుణమాఫీ కాకపోవడంతో కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారన్నారు. రైతుభరోసా నగదు అందించకపోవడంతో రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పాదూరి గోవర్ధని, ముల్లాల కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వనమ్మ, పద్మ ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 10: పంట నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. మండలంలోని నక్కలపెంటతండా గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బతండాలో పంట నష్టపోయిన రైతులను పరామర్శించి, నీటిలో మునిగిన పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. దుబ్బతండాలో అకాల వర్షంతో 300 ఎకరాల పత్తి, వరి పంటలు బ్యాక్ వాటర్‌లో మునిగిపోవడంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాధిత రైతులను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కేతావత్ వినోద్, సీతయ్య, స్వామి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపు తేవాలి

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 10: కష్టపడి పనిచేసి ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపు తీసుకురావాలని ఎంఈవో తరి రాములు కోరారు. నేషనల్ అచీవ్మెంట్ టెస్ట్(ఎన్ఏఎస్) మాక్ టెస్ట్ నిర్వహణ మానిటరింగ్‌లో భాగంగా మంగళవారం పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎల్. పద్మను సన్మానించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా జిల్లా సెక్టోరల్ అధికారి రమావత్ రాంచంద్రం, జిల్లా కామన్ పరీక్షల బోర్డు సెక్రటరీ కొమ్ము శ్రీనివాస్, పీఆర్టీయూ మండల అధ్యక్ష ప్రధనకార్యదర్శులు కె. మూనా, ఆర్. అనిల్‌కుమార్, జయపాల్, తరాల పరమేశ్‌యాదవ్, రాయికంటి సైదులు, రవీందర్‌నాయక్, మాదవి, వెంకట్, రాందాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

కట్టంగూరు, సెప్టెంబరు 10: అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని మండల ప్రత్యేకాధికారి వి. కోటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని పరడ గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. శానిటేషన్, స్మశానవాటిక, కంపోస్టు షెడ్, పల్లె ప్రకృతి వనం తదితర పనులను పరిశీలించారు. గ్రామాల్లో డ్రైనేజీ పద్ధతి మెరుగుపర్చాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, ఏపీవో కడియం రాంమోహన్, ఏపీఎం చెరుకు సైదులు ఉన్నారు.

చిట్యాలరూరల్: గ్రామాల్లో చెత్తా చెదారంను తొలగించి పరిశుభ్రతను పాటించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని, పల్లెప్రకృతివనంను, స్మశాన వాటిక, డంపింగ్‌యార్డ్, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలోని తరగతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్‌పి. జయలక్ష్మి, ఎంపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి మట్టపల్లి కృష్ణయ్య ఉన్నారు.

చేనేత కార్మికులకు రుణ మాఫీ హర్షనీయం

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 10: రాష్ట్ర ప్రభుత్వం చేనేత పారిశ్రామికులు, కార్మికులను ఆదుకునేందుకు రుణ మాఫీ ప్రకటించడం హర్షనీయమని చేనేత పారిశ్రామిక నిధి ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి రాపోలు దత్త గణేష్ అన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేత కార్మికుల రుణ మాఫీ చేస్తామని ప్రకటించి అమలు చేయలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రుణాలు మాఫీ చేస్తామనడంతో పాటు వారిని ఆదుకునేందుకు మహిళా సంఘాలకు ప్రతి ఒక్కరికి సంవత్సరానికి రెండు చీరలు చేనేత కార్మికుల ద్వారా తయారు చేసిన చీరనే అందించే విధంగా చర్యలు తీసుకుంటామనడం అభినందనీయమని అన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : ఏఐటీయూసీ

దేవరకొండ, సెప్టెంబరు 10: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నూనె రామస్వామి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. 23 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు కనీస వేతనాలులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్లు, అత్యవసర సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు, గంగమ్మ, నోముల ధనలక్ష్మీ, ఝాన్సీ, సరిత, మల్లయ్య, నాంపల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 10: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గుండ్రాంపల్లిలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. దొరలు, భూస్వాములు, జమీందారులు జాగీరుదారులకు వ్యతిరేకంగా తెంగాణ ప్రాంతంలో పల్లెపల్లెలో ఎందరో ఎర్రజెండాలు పట్టి సాయుధ పోరాటంలో పాల్గొన్నారన్నారు. సమావేశంలో నాయకులు ఎండీ. అక్బర్, బొడిగె సైదులు, జిల్లా సత్యం, కేతరాజు అంజయ్య, జిల్లా యాదయ్య, ఏర్పుల రాములు, సీమ అంజయ్య, జిల్లా లింగస్వామి, రెడపాక రవి, సర్గాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వనీటి ప్రవాహానికి కల్వర్టే అడ్డు


నిరుపయోగంగా ఉన్న కల్వర్టు



- మునుగోడు-చిట్యాల రోడ్డులో కల్వర్టు నిర్మాణం
- ఎగువ నుంచి వచ్చే నీరు మధ్య నుంచే దిగువకు
- నీరు వృథా అవుతోందని రైతుల ఆందోళన

మునుగోడు, సెప్టెంబరు 10: కాల్వనీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా కల్వర్టు నిర్మిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్అండ్‌బీ, నీటి పారుదల శాఖల సమన్వయ లోపం, పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో లక్షలాది రూపాయలు వెచ్చించి మునుగోడు- చిట్యాల వెళ్లే రహదారిలో నిర్మించిన కల్వర్టు నిరుపయోగంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్వర్టు ద్వారా మునుగోడు మండలం ఊకొండి గ్రామ శివారులోని వేంకటేశ్వర చెరువుకు వరద నీరు వస్తుంది. ఎగువ నుంచి మండల పరిధిలోని కిష్టాపురం పెద్దచెరువు, ఇప్పర్తి చెరువు మీదుగా చిట్యాల మండలంలోని తాళ్లవెల్లాంల చెరువు నుంచి ఊకొండి వేంకటేశ్వర చెరువుకు నీటి కాల్వ ఉంది. మునుగోడు-చిట్యాల ఆర్అండ్‌బీ రహదారికి ఉన్న నీటికాల్వకు కల్వర్టు నిర్మాణం కోసం గతంలో ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేసింది. గూనలతో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. ఐదేళ్ల క్రితం రహదారి విస్తరణ పనుల్లో స్లాబ్‌తో కల్వర్టు నిర్మాణం కోసం మరో రూ.7లక్షలు ఖర్చు చేశారు. కానీ కాల్వ నీటి ప్రవాహానికి అనువుగా చేయాల్సిన పనులు చేపట్టాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా పనులు చేయడంతో ఎగువన ఉన్న చెరువు నుంచి కాల్వ ద్వారా వచ్చే వరద నీటికి కల్వర్టు నీరు అడ్డు అడ్డుతగులుతున్నాయి. దీంతో కల్వర్టుకు ముందు నిర్మించి ఉన్న కాల్వ కట్ట కోతకు గురై తెగిపోతుంది. కాల్వలో వచ్చే నీరంతా దిగువకు వృథాగా పోతుందని రైతులు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ సమస్య తలెత్తిందని రైతులు రైతులు పేర్కొంటున్నారు. మరో పక్కా కాల్వ ద్వారా మళ్లించే నీటికి ఎగువన గేట్లు బిగించాలని, దిగువన గల కుపిరెడ్డిగూడెం రైతుల పొలాలకు వెళ్లే దారికి కొత్తగా కల్వర్టును నిర్మించాలని రైతులు కోరుతున్నారు. తద్వారా ప్రయోజనం కలుగుతుందని పేర్కొంటున్నారు.

కాల్వనీటి ప్రవాహానికి అనువుగా కల్వర్టు నిర్మించాలి



ఊకొండి గ్రామ శివారులోని వేంకటేశ్వర చెరువుకు అవసరమైన వరద నీటి లభ్యత లేదు. ఎగువ నుంచి వచ్చే నీటి కాల్వల ద్వారా వచ్చే వరద నీటితోనే చెరువులో జలకళ సంతరించుకుంటుంది. ఆ కాల్వలకు రోడ్డు ఉన్న చోట నిర్మించాల్సిన కల్వర్టులు నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నెలకొన్న ఈసమస్యతో కాల్వ నీరు వృథా పారుతోంది. దీంతో నెలకొన్న సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం పట్టించుకొని అవసరమైన నిధులు మంజూరు చేసి కల్వర్టు నిర్మాణ పనులను అనువుగా చేపట్టాలి.


- నిమ్మల స్వామి రైతు, ఊకొండి గ్రామం

కొత్తగా కల్వర్టుకు ప్రతిపాదనలు పంపాం

ఊకొండి శివారులోని వెంకటేశ్వర చెరువుకు ఎగువ నుంచి వచ్చే నీటి కాల్వ కల్వర్టును గతంలో నిర్మించారు. ఆ నిర్మాణ పనులు నీటి ప్రవాహానికి పూర్తి అడ్డంకిగా ఉన్నాయి. దీంతో కల్వర్టు నిరుపయోగంగా ఉంది. సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు, రైతుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న కల్వర్టును తొలగించి శాశ్వత ప్రతిపాదికన కొత్తగా కల్వర్టు నిర్మాణం కోసం గతేడాదిలోనే ప్రతిపాదనలు తయారు చేసి పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

- వెంకటరమణ ఏఈ, నీటి పారుదల శాఖ, మునుగోడు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బాలు


సురేష్‌రెడ్డి విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, సెప్టెంబరు 10: ట్రేడర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్ మార్కెట్‌యార్డులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రూ.2కోట్లతో అదనంగా 20 రేకుల షెడ్ల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొంతం సంజీవరెడ్డి, అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, రామిని నగేష్, రవీందర్, దేశిరాం, యాదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ మార్కెట్ మాజీ చైర్మన్ తిప్పర్తి సురేష్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని తెలుగుపల్లిలో తిప్పర్తి సురేష్ రెడ్డి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. దేవరకొండ మార్కెట్ చైర్మన్‌గా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా, జిల్లా కమిటీ సభ్యుడిగా సురేష్‌రెడ్డి పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి, జాల నర్సింహరెడ్డి, లోకసాని కృష్ణయ్య, నాగభూషణం, వేమన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, జాల నర్సింహరెడ్డి, మాజీ ఎంపీపీ జాన్‌యాదవ్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, సంజీవరెడ్డి, నాయిని మాధవరెడ్డి, దేవేందర్ నాయక్, రాంసింగ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. దేవరకొండలోని క్యాంపు కార్యాలయంలో పది మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే బాలునాయక్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌కిరణ్, నాయకులు పున్న వెంకటేశ్వర్లు, హనుమంతు వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి : ఎమ్మెల్యే


ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, సెప్టెంబరు 10: వైద్యులు సమయపాలన పాటించాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యుల, సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. అన్ని వార్డులను తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షల వివరాల రిపోర్టులను రోగులకు వెంటనే అందేలా చూడాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంవో డాక్టర్ భానుప్రసాద్‌నాయక్, నాయకులు తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, నందికొండ మునిసిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్ చైర్‌పర్సన్ నాగరాణి, రామకృష్ణ, నాగరాజు, శంకర్, రంగారెడ్డి, ఖాసీం పాల్గొన్నారు. అనంతరం సాగర్ హిల్‌కాలనీ దయ్యాలగండి సమీపంలో సమ్మక్క-సారక్క పుష్కర ఘాట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న నిమజ్జన ప్రాంతాన్ని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. సీఐ భీసన్నను నిమజ్జన ఏర్పాట్ల గురించి అడిగి తెలపుకున్నారు. కార్యక్రమంలో సాగర్, పెద్దవూర ఎస్ఐలు సంపత్, వీరబాబు, ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి


నల్లగొండలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భూపాల్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్ వర్క్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని సాగర్‌రోడ్డులో గల ఆమె విగ్రహానికి నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులుఆర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట వీరనారీ చాకలి ఐలమ్మ అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కటికం సత్తయ్యగౌడ్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు కొందూరు సత్యనారాయణ, బోనగిరి దేవేందర్, మిర్యాల యాదగిరి పాల్గొన్నారు. దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. సీపీఐ, బీసీ సంక్షేమసంఘం, రజక సంఘాల ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. మర్రిగూడలో జరిగిన కార్యక్రమంలో కొలుకులపల్లి యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, పుప్పాల యాదయ్య, ఆదివాసీ శ్రీనివాస్ పాల్గొన్నారు. చిట్యాలలో సీపీఎం నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, అరూరి శ్రీను, ఐతరాజు నర్సింహ్మ, ఐతారాజు యాదయ్య పాల్గొన్నారు. కేతేపల్లిలో జరిగిన కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు జె. వెంకటనర్సయ్యయాదవ్, ఎస్.మంగమ్మ, సీహెచ్.జానయ్య, ఎస్.జేజయ్య, బయ్య ముత్తయ్య, చింత ఆంధ్రయ్య, సీహెచ్.లూర్దుమారయ్య పాల్గొన్నారు. నకిరేకల్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాళ ప్రమీళ, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు, బొజ్జ చిన్నవెంకులు పాల్గొన్నారు. శాలిగౌరారంలో రజక సంఘం మండల అధ్యక్షులు బాసాని వెంకన్న, తాందారి నాగయ్య, తాందారి సత్తయ్య, తాందారి వెంకటేష్, అనుముల వెంకన్న పాల్గొన్నారు. మిర్యాలగూడలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతిలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ కేతావత్ శంకర్‌నాయక్ ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ విగ్రహం వద్ద సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మాల్లేష్, మల్లు గౌతంరెడ్డి నివాళులర్పించారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనగల్, హాలియా, మునుగోడు మండలాల్లో నారీ ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ దేవ్‌సింగ్

దామరచర్ల, సెప్టెంబరు 10: డీలర్లు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని ఏడీఏ బి. దేవ్‌సిగ్ అన్నారు. మండలంలోని ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌లో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అధిక ధరలకు యూరియా విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎరువులను ఈ-పాస్ మిషన్ ద్వారానే విక్రయించాలన్నారు. అనంతరం స్థానిక రైతువేదికలో క్రాప్‌లోన్ ఉండి రేషన్‌కార్డు లేక పంట రుణమాఫీ కాని రైతుల కుటుంబసభ్యుల నిర్ధారణ సదస్సు నిర్వహించారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం రైతు రుణమాఫీ యాప్ ద్వారా వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్దేశించిన తేదీల్లో రైతులు తమ కుటుంబసభ్యుల వివరాలను వ్యవసాయాధికారులకు అందిస్తే యాప్‌ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రమావ్ పార్వతి, అజ్మీరా సైదులు, పీఏసీఎస్ సీఈవో వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'ప్రభుత్వం రైతుల గోడు వినాలి'

చండూరు రూరల్, సెప్టెంబరు 10: రుణమాఫీ కాని రైతుల గోడు వినేందుకు కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి రావాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాసాల వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించేందుకు మంగళవారం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఏక కాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల గొప్పలు చెబుతున్నారని, ఉత్తమాటలు కట్టిపెట్టి గ్రామాల్లో వచ్చి రుణమాఫీ కాని రైతుల ఆవేదనను వినాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలి'

చిట్యాలరూరల్, సెప్టెంబరు 10: విద్యాభివృద్ధికి దాతలు తోడ్పాటునందించాలని మండల విద్యాధికారి కూకుంట్ల నర్సింహ అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దివీస్ లాబొరేటరీస్ సౌజన్యంతో మంగళవారం నోట్‌బుక్కులు, బ్యాగులు, వాటర్‌బాటిళ్లు, చెప్పులు, అందించగా పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు బోధనలతో పాటు వారి మేధస్సును పెంపొందించి సత్ఫలితాలను సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజమ్మ, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రావు, దివీస్ ప్రతినిధులు ఎస్. సాయికృష్ణ, బెల్లం గోపి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చండూరు రూరల్, సెప్టెంబరు 10: పౌష్టికాహారంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. మండలంలోని దోనిపాములలో మంగళవారం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి గర్భిణి, బాలింత, చిన్నపిల్లలకు పోషక విలువలున్న ఆకు కూరలు, పాలు, గుడ్లు, మొలకెత్తిన గింజలు, రాగులు, జొన్నలు ఉండేలా ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు.

శాలిగౌరారం: పౌష్టికాహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా అవుతారని మండల వైద్యాధికారి డాక్టర్ సూర్య శిల్ప అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులు, మహిళలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో పౌష్టికాహార దాత తాందారి వెంకటేష్-శ్రీవాణి, పీహెచ్ఎన్ రాములమ్మ, సూపర్‌వైజర్ మరియా, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, బిక్షం, గుండ్ల రామ్మూర్తి, మద్ది వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవరకొండ: పోషకాహారం, రక్తహీనతపై మర్రిగూడలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో మండల వైద్యాధికారి దీపక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యశోద, ఎం. శ్రీలత, ఆర్‌బీఎస్‌కె మేనక, పాల్గొన్నారు.

మునుగోడు రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని మండల పంచాయతీ అధికారి మురళి అన్నారు. మండలంలోని ఇప్పర్తిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ మాసోత్సవాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, ఎంపీవో స్వరూప రాణి, పంచాయతీ కార్యదర్శి లింగస్వామి, అంగన్‌వాడీ టీచర్స్ శంకరమ్మ, ధనలక్ష్మీ, సుజాత, మంజుల, ఆశా కార్యకర్త కమల, హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కనగల్, సెప్టెంబరు 10: మండలంలోని జీఎడవల్లి హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి కె. కార్తీక్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వరంగల్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మీ, పీడీ నారాయణకవిత తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కార్తీక్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం..

తిరుమలగిరి(సాగర్): జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి జిల్లాకన్వీనర్‌గా మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన వంగూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా సైన్స్ పీపుల్ నెట్‌వర్క్, జేవీవీ తెలంగాణలో 30 సంవత్సరాలుగా మూఢ నమ్మకాల పట్ల, సైన్స్‌పట్ల అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని శ్రీనివాస్ తెలిపారు.

తిరుమలగిరి(సాగర్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నిడమనూరు మండలం వెంగన్నగూడెం గ్రామానికి చెందిన రవికి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ, ప్రధాన కార్యదర్శి పుట్ట మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.1.34లక్షలు అందజేశారు.

మునుగోడు: పోషక ఆహారంతో పాటు ఆట, పాటలు ఆరోగ్యానికి దోహదపడతాయని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆరేళ్ల సైదులుముదిరాజ్ అన్నారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లోని చిన్నారులకు ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, పందుల భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, పద్మ, నాయకులు వనం సైదులు, లింగస్వామి, మల్లేష్, కుమారస్వామి, రవి పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని చినమాదారం గ్రామ హైస్కూల్ విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, మాజీ సర్పంచ్ దేప నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, రమేష్, రజిత, పల్‌రెడ్డి ఫౌండేషన్‌చైర్మన్ రాంరెడ్డి ఉన్నారు.

నాగార్జునసాగర్: బెంగళూరులో ఈ నెల 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యత శిబిరానికి సాగర్ హిల్ కాలనీ బీసీగురుకుల కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న గణేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఏటీపీ గాయత్రి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ విద్యార్థినిని అభినందించారు.

చందంపేట: కాంగ్రెస్ పభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోందని సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ అన్నారు. మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రూ.2లక్షల రుణమాఫీ బోగస్ అని, ఇంతవరకు అర్హులైన రైతులకు కూడా మాఫీ కాలేదన్నారు. వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లు ఇంతవరకు పెంచలేదన్నారు. సమావేశంలో గోసుల శివ, జబ్బు తిరుపతయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

కేతేపల్లి: దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడంలో విద్యార్థులు బాధ్యతను తీసుకోవాలని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డు గ్రహీత పెండెం కృష్ణకుమార్ కోరారు. మండలంలోని తుంగతుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి, దేశ నాయకులు, శాస్త్రవేత్తల చిత్రపటాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అశోక్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సువర్చలాదేవి, వెంకటరత్నం, మనోహర్, వెంకన్న, ధనలక్ష్మీ, గోపి ఉన్నారు.

హాలియా: కార్యకర్తల కుటుంబాలను బీఆర్ఎస్ ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని ఇబ్రహీంపేటకు చెందిన ఆవుల వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రూ.2లక్షల పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, కూరాకుల వెంకటేశ్వర్లు, చాపల సైదులు, నల్లగొండ సుధాకర్, సురభి రాంబాబు, మర్రిమహేష్, శంకర్, గోగు వీరశేఖర్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరించడం తగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ అన్నారు. కొండమల్లేపల్లి పాత బజార్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 17న సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ సాయుధ రైతాంగ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పుడుగుండ్ల రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్, జగన్‌నాయక్, వీరన్న, నూమాన్, సమీర్, సూర్యా, అఖిల్ , వెంకటేశ్వర్లు, బన్నీ, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్. ఉపేందర్ తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, రసాయనశాస్త్రం, జంతుశాస్త్రం బోధించేందుకు అవసరమైన అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. సంబంధిత కోర్సుల్లో 55శాతం మార్కులు సాధించిన జనరల్, ఓబీసీ అభ్యర్థులు, 50శాతం మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలున్న అభ్యర్థులకు తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు.

కొండమల్లేపల్లి: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే మాక్ టెస్ట్‌ను కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. హెచ్‌ఎం రమావత్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ 6వ తరగతి, 9వవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను సబ్జెక్టుల వారీగా తెలుసుకునేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఏ మాక్ టెస్ట్ రెండు సార్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో మాక్ టెస్ట్-1 నిర్వహించినట్లు తెలిపారు. పూర్తిస్థాయి టెస్ట్ నవంబరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల కార్యదర్శి మల్లెల జనార్ధన్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్ నేనావత్ జానునాయక్, ధనావత్ బాలాజినాయక్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన భూతరాజు సురేష్ పది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సురేష్‌కు భార్య, ఆరేళ్ల లోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన 37మంది యువకులు రూ.48వేలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: హైదరాబాద్‌కు చెందిన ఆశ్రయ్ ఆకృతి స్వచ్ఛ సంస్థ వ్యవస్థాపకుడు డీపీకే బాబు సహకారంతో కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో సోలిడార్ తెలంగాణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 20మంది విద్యార్థులకు రూ.5లక్షల విలువ చేసే వినికిడి యంత్రాలు, రూ.లక్ష విలువైన టీవీ అందజేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు మరో ఐదు రాష్ట్రాల్లో తమ సేవలు అందిస్తున్నట్లు డీపీకే బాబు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సమన్వకర్త అబ్దుల్ రహీం, ప్రవీణ్, జయంత్, నిర్వాహకులు దార్ల భాస్కర్, సురేష్, సైదా, మహేష్ పాల్గొన్నారు.

